క్లుప్తంగా

దుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని ప్రగతినగర్లో దుర్గమ్మ తల్లి దేవస్థానంలో స్థానిక భక్తులు బుధవారం అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో మెగా రక్తదాన శిబిరం

ఒంగోలు మెట్రో: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరాయ విద్యాలయం వారిచే మెగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా ఈ నెల 22, 23 తేదీల్లో స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా రెడ్ క్రాస్ సొసైటీలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యువత పాల్గొని రక్తదానం చేసి జయప్రదం చేయాలని బ్రహ్మకుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ప్రతినిధులు కోరారు.

ఘనంగా శ్రీకృష్ణుని నగరోత్సవం



శ్రీకృష్ణుడికి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఒంగోలులో బుధవారం మధ్యాహ్నం శ్రీ కృష్ణ భగవానుడి ప్రతిమకు ఘనంగా నగరోత్సవం నిర్వహించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని నెహ్రూనగర్లో వేదిక నిర్మించి శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి ఐదు రోజులపాటు పూజలు నిర్వహించారు. చివరిరోజు శ్రీకృష్ణుడిని పల్లకిపై ఉంచి వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఒంగోలు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సుబ్బారావు, స్రవంతి, సురేష్ శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, విశ్వనాథ్, మాధవీలత, సుబ్బయ్య, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గ్రామ సభతో ట్రాఫిక్ అంతరాయం

కొత్తపట్నం: స్థానిక బస్టాండ్ సెంటర్లో నడిరోడ్డుపై బుధవారం అన్నదాత సుఖీభవ గ్రామ సభ నిర్వహించడంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు లౌడ్‌స్పీకర్ల ధ్వనితో ప్రజలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందుగా కొప్పోలు నుంచి కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడం, అనంతరం బస్టాండ్ సెంటర్లో డీజే స్పీకర్లు, స్టేజీ ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా బస్టాండ్ సెంటర్లో ఫ్లెక్సీలు కడతుంటే అడ్డుకున్న పోలీసులకు.. ప్రస్తుతం ఏకంగా బస్టాండ్ సెంటర్లో స్టేజీ ఏర్పాటు చేసి అన్నదాత సుఖీభవ గ్రామ సభ నిర్వహించడం, డీజే స్పీకర్లు పెట్టి ప్రజలను అసౌకర్యానికి గురిచేయడం కనిపించడం లేదా..? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పోలీస్‌శాఖ, పంచాయతీ అధికారులు కూటమి ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని, దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని స్థానికులు తెలిపారు.

ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదు

- ఏపీజీఈఏ కంభం తాలుకా అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి

కంభం:

ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే సహించేది లేదని ఏపీజీఈఏ కంభం తాలుకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం సమీపంలోని శిఖరం అటవీ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, వారి అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అటవీ శఖాఖ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాసనాలు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలవాల్సిన వారే ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీజీఈఏ తాలుకా కార్యదర్శి రంగస్వామిరెడ్డి, ట్రెజరర్ వెంకట రంగయ్య, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.





మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంక్-1 కట్టపై ఎండిపోయిన టెంకాయచెట్లు



కిందపడిపోయిన సోలార్ లైట్ పోల్



పైపులు ఊడిపోయి వృథాగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ సిస్టం

పచ్చదనంపై కుట్రలు

- ఒంగోలు కార్పొరేషన్ – ఒడా మధ్య నలిగిపోతున్న పచ్చదనం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.63 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు-1 కట్టపై అభివృద్ధి పనులు
- ప్రస్తుతం పూర్తయిన పనులను కార్పొరేషన్‌కు అప్పగిస్తామంటున్న ఒడా
- స్వాధీనం చేసుకోవడానికి ససేమిరా అంటున్న ఒంగోలు నగరపాలక సంస్థ
- ఎవరూ పట్టించుకోకపోవడంతో మళ్లీ కళావిహీనంగా మారుతున్న ఎస్ఎస్ ట్యాంకు-1
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించకుండా కుట్రలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేసిన దుండగులు
- పర్యావరణం, పచ్చదనంపై కూడా కుట్రలు చేయడంపై తీవ్ర విమర్శలు





పచ్చటి గడ్డి మధ్యలో ఎండిన చెట్లు

ఒంగోలు సబర్బన్: వైఎస్సార్ సీపీని లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చివరకు పచ్చదనం, పర్యావరణం, ప్రజలకు ఆహ్లాదం పంచే వాటి గురించి కూడా ఆలోచించకుండా కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు అనే కారణంతో నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. ఆ అభివృద్ధి ప్రజలకు కనిపించకుండా చేసేందుకు ఉద్దేశపూర్వకంగా అధికారులు, కూటమి ప్రభుత్వ పాలకులు దిగజారుడు రాజకీయాలు చేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఓ రెండు ప్రభుత్వ విభాగాలు పర్యావరణంపై సైతం పగబట్టడంపై ఒంగోలు నగర వాసులు ఛీ కొడుతున్నారు. ఆయా విభాగాల తీరు కారణంగా పచ్చగా పదికాలాల పాటు ఒంగోలు నగర ప్రజలకు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన చెట్లు, మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. ఇందుకు ఆస్తి వివాదాలు కారణం కాదు. ఆ చెట్లకు, మొక్కలకు నీరుపోయవద్దని ఎవరూ చెప్పలేదు. ఆ చెట్లు చేసుకున్న పాపమేమిటో వాటిని ప్రతిరోజూ చూస్తున్న వాకర్లకు అర్థంగాక పాలకులు, అధికారుల తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు. పూర్తి వివరాల్లోకెళ్తే...

ఒంగోలు నగరాభివృద్ధి సంస్థ (ఒడా) నిధులతో ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు-1ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చేశారు. మొత్తం రూ.1.63 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు-1 చుట్టూ ఉన్న కట్టను వాకింగ్ ట్రాక్‌గా మార్చి నగర ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచేలా సిద్ధం చేశారు. ట్యాంకు చుట్టూ 2.5 కిలోమీటర్ల మేర ఉన్న కట్టను వాకింగ్ ట్రాక్‌గా మార్చడంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది ఆ కట్టపై వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అదేవిధంగా కట్ట చుట్టూ టెంకాయ చెట్లు, మొక్కలు నాటారు. వాటిని బతికించడానికి డ్రిప్ ఇరిగేషన్ సిస్టం కూడా ఏర్పాటు చేశారు. కట్ట చుట్టూ సోలార్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. కట్టకు ఆనుకుని ఉత్తరం వైపు యోగా కోసం ఓపెన్ ప్లాట్‌ఫాం నిర్మించారు. అదేవిధంగా కట్టకింద యువత కోసం ఉత్తరం వైపున ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. మొత్తం అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత 2023 మే 20వ తేదీ ప్రారంభించారు. మిగిలిన పనులను 2024 జనవరికల్లా పూర్తి చేసి ఒంగోలు నగర ప్రజలకు అంకితం చేశారు. ఎంతో ఆహ్లాదకరంగా తయారు చేయడంతో సంతపేట, రామ్‌నగర్, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు, మామిడిపాలెం, గద్దలగుంట, విజయనగర్‌కాలనీ, సీఆర్‌పీ క్వార్టర్స్, వీఐపీ రోడ్డు, మంగమూరు రోడ్డు, రాజీవ్‌నగర్.. ఇలా నగరంలోని సగం ప్రాంతాల ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ ట్రాక్‌పై నడుస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

స్వాధీనం చేస్తామన్నా చేసుకోరు...

ఒడా నిధులతో ఎస్ఎస్ ట్యాంకు-1 పనులు పూర్తయిన తరువాత ఒడా అధికారులు చెరువును స్వాధీనం చేసుకోవాలని ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులను అనేకసార్లు కోరారు. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నెరిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చివరినాళ్లలో చేసిన పనులు కాబట్టి ఎన్నికల కోడ్ రావటం, ఎలక్షన్ హడావిడిలో అధికారులు కూడా మునిగిపోయారు. ఎన్నికలు అయిన తరువాతయినా చేసిన అభివృద్ధి పనులను స్వాధీనం చేసుకుని వాటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని కోరినా.. ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు అందుకు ససేమిరా అంటున్నారు. ఒడా అధికారులు నిర్వహించటానికి వాళ్ల వద్ద మెకానిజం లేదు. చెట్లకు నీళ్లు పోసేవారు ఉండరు. పాదులు తీసే వారుండరు. వారు నాటిన చెట్లు, మొక్కలను పోషించే పరిస్థితి లేకపోవటంతో ప్రస్తుతం అవన్నీ నిలువునా ఎండిపోతున్నాయి. ఎస్ఎస్ ట్యాంకు ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఉంటుంది. ట్యాంకు నిర్వహణ మొత్తం వారే చూస్తున్నారు. కానీ, వాకింగ్ ట్రాక్‌పై ఉన్న చెట్లకు, మొక్కలకు నీళ్లుపోయరు. పోషణకు మందులు వాడరు. దాంతో రూ.లక్షలు వెచ్చించి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి తెచ్చి వేసిన టెంకాయ చెట్లు నిలువునా ఎండిపోయాయి. ఈ రెండు విభాగాల అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజల సొమ్ము ఆవిరైపోతోంది. డ్రిప్ సిస్టం సైతం ఎందుకూ పనికిరాకుండా పోతోంది.

శిలాఫలకం కూడా ధ్వంసం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ధ్వంసం చేశారు. ఆ శిలాఫలకంలో ఉన్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను సైతం ధ్వంసం చేశారు. శిలాఫలకం ఏర్పాటు చేసిన దిమ్మెకు మాత్రం ఎలాంటి నష్టం చేకూర్చని దుండగులు కేవలం శిలాఫలకంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్లు, వారి ఫొటోలు మాత్రమే ధ్వంసం చేశారు. చేసిన పనులకు సంబంధించిన మొత్తానికి ఓపెన్ జిమ్ ముందు భాగంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఇంతటి దుర్మార్గానికి తెగబడినా ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులుగానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులుగానీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోలేదు. కనీసం ఆ శిలాఫలకాన్ని తిరిగి పునరుద్ధరించడం కూడా చేయలేదు. దీంతో ఆ ధ్వంస రచనలో వీరిపాత్ర ఏ మేరకు ఉందోనని నగర ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం చెట్లన్నీ నిలువునా ఎండిపోతున్నప్పటికీ, ఎస్ఎస్ ట్యాంకు-1లో నిండుగా నీళ్లున్నప్పటికీ ఆ చెట్లకు నీళ్లు పోయడానికి మాత్రం ఎవరూ లేరంటే ఆ రెండు ప్రభుత్వ విభాగాల మధ్య ఆధిపత్య పోరు.. పట్టించుకుని చక్కదిద్దని స్థానిక ఎమ్మెల్యే తీరుపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్ఎస్ ట్యాంకు-1 వద్ద ఏర్పాటు చేయగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధ్వంసం చేసిన శిలాఫలకం

దోమల నివారణ చర్యలు పాటించాలి



సంతనూతలపాడులో దోమల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది



కొత్తపట్నంలో రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రావ్య, సిబ్బంది

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేకుంటే ఆ నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా తయారవుతాయని, అందువలన దోమల నివారణ చర్యలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతనూతలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో, బస్టాండు దగ్గర అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ చర్యల గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు సాగర్, సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ సుధామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాధవరావు, వెంకటరావు, కృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలను నివారించాలి

మద్దిపాడు: దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ సిబ్బందికి సూచించారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి శుక్రవారం గ్రామస్తులు డ్రై డే పాటించే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌సీలకు సూచించారు. దోమలను నివారించడానికి అవసరమైన చర్యలు ఆరోగ్యశాఖ తీసుకుంటుందని తెలిపారు. అనంతరం వైద్య శాఖ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వినీల చౌదరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజిత కుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం:

దోమలు లేని గ్రామాలను తీర్చిదిద్దుకుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని కొత్తపట్నం ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం వైద్యారోగ్య సిబ్బందితో దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావ్య మాట్లాడుతూ సర్ రోనాల్డ్‌రాస్ ఆడ అనాఫిలస్ దోమల ద్వారా మలేరియా జ్వరం వస్తుందని కనుగొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకార్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సంతనూతలపాడు ఎంపీడీవో సురేష్‌బాబు అధికారులకు సూచించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అభ్యున్నతిపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను వెంటనే పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వీరాంజనేయులుకు సూచించారు. గ్రామాల్లో 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. వెలుగు శాఖకు సంబంధించి ఎస్‌హెచ్‌జీ గ్రూపుల రుణాలను, రీ పేమెంట్స్, ఉన్నతి, శ్రీనిధి పథకాల రికవరీలను వేగవంతం చేయాలన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకానికి సంబంధించి మండలంలో 210 సోక్‌పిట్స్‌లో 91 మాత్రమే పూర్తి చేశారని, మిగిలినవి కూడా వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ ప్రక్రియను కార్యదర్శులు వేగవంతం చేయాలన్నారు. ప్రతిరోజూ చెత్త సేకరణ జరగాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో వర్మీకంపోస్ట్ తయారు చేయాలని అధికారులకు ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమణమ్మ, మండల పరిషత్ ఏవో శారద, వెలుగు ఏపీఎం బాబూరావు, ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, ఈసీ ఈశ్వరి, వెలుగు సీసీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ అడ్డగింత

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక కబాడీపాలెం, క్లోపేట జంక్షన్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నారు. రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నించారు. గతంలో ఇక్కడున్న రాజీవ్‌గాంధీ విగ్రహం ట్రాఫిక్‌కు అడ్డంగా ఉండటంతో మున్సిపల్ అధికారులు తొలగించారు. బుధవారం తిరిగి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నించడంతో క్లోపేట, కబాడీపాలెం వాసులు అడ్డుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు ఎస్‌కే సైదా, టీడీపీ నాయకుడు టింకు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ పునరుద్ధరణపై జేసీ సమీక్ష



డెయిరీల మాజీ చైర్మన్లు, రైతు ప్రతినిధులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు పాల కేంద్రం పునరుద్ధరణపై ప్రాథమిక సమావేశం జిల్లా పాడి రైతులతో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ నిర్వహించారు. స్థానిక జేసీ చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో పాడి రైతులు, గతంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులుగా పనిచేసిన వారు పాల్గొన్నారు. రైతుల అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, డెయిరీ పునరుద్ధరణ అవసరాన్ని వివరించారు. ప్రధానంగా ఒంగోలు డెయిరీకి 78.1 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుత బకాయిలు రూ.43 కోట్లు ఉన్నాయని, డెయిరీ మూతపడి ఉండటంతో పరికరాలు, మిషనరీ చెడిపోయాయని సమీక్షలో ప్రస్తావనకు వచ్చాయి. కనిగిరి (3.8 ఎకరాలు), కంభం (5.34 ఎకరాలు), యర్రగొండపాలెం (4.7 ఎకరాలు), కొండమంజులూరు (12.07 ఎకరాలు), దర్శి (4 ఎకరాలు) ప్రాంతాల్లోని పాల శీతలీకరణ కేంద్రాల భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని జేసీకి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మదర్ డైరీ మోడల్ అమలు చేస్తేనే మంచి ధరలు రైతులకు లభిస్తాయని కోరారు. జేసీ మాట్లాడుతూ అన్ని రకాల ప్రయత్నాలు చేసి డెయిరీ పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ డెయిరీ మేనేజర్, ఒంగోలు డెయిరీ సీఈఓ రాజమోహన్‌ను డెయిరీకి సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.రవి డెయిరీ ఆస్తుల రక్షణకు ఫెన్సింగ్ లేదా ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి త్వరలో కుట్టుమిషన్లు

- బీసీ వెల్ఫేర్ ఈడీ వెంకటేశ్వర్లు



శిక్షణ పొందుతున్న మహిళలతో బీసీ వెల్ఫేర్ ఈడీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలందరికీ త్వరలో కుట్టు మిషన్లు అందిస్తామని బీసీ వెల్ఫేర్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మద్దిపాడులో కుట్టు శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి ఈ నెల 30వ తేదీ పరీక్ష ఉంటుందన్నారు. నెలాఖరులో స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టుమిషన్లు అందిస్తామన్నారు. శిక్షణ తీసుకుంటున్న మహిళలను ఆయన పలు ప్రశ్నలడిగి సమాధానాలు తెలుసుకున్నారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలు తాము కుట్టిన దుస్తులను ఆయనకు చూపించారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించిన రోజు ఆ కుటుంబం మెరుగైన జీవితాన్ని పొందుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఇది మంచి అవకాశమని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ వి.జ్యోతి, శిక్షకురాలు ప్రసన్న, జీఎంఎస్‌కే ఎంపీ సుజాత, పలువురు మహిళలు పాల్గొన్నారు.